"ఛీఛీ... మళ్ళీ ఆడపిల్లే..." మురికిగుంటలో కాలు పెట్టిన వాడిలా అసహనంగా అన్నాడు చంద్రశేఖర్.

ఒక్కసారి కాదు. ఇప్పటికి ఏ పాతికసార్లో



# పెళ్ళి చేయండి డాడీ! ప్లీజ్...

అలా అన్నాడు. నీలవేణి ఆస్పత్రి నుంచి డిశ్చార్చి అయి రెండు గంటలైనా కాలేదు. అప్పుడే అరుపులు మొదలెట్టాడు. అతని అరుపులకు నీలవేణి క్షణక్షణం భయపడుతోంది.

"ఎందుకే అస్తమానూ ఆడపిల్లలను కంటూ నా చేత పాపాలు చేయిస్తావ్? నీ కడుపులో ఆడపిల్లల ఫ్యాక్టరీ గానీ స్థాపించావా? ప్రసవించిన ప్రతిసారీ ఆడపిల్లనే ప్రసవిస్తున్నావు. ఇప్పటికే రెండు హత్యలు చేసి కుమిలిపోతున్నాను. మళ్ళీ ఇప్పుడు మూడో హత్యకు పురమాయించావు" నీలవేణి చేతుల్లో గువ్వలా ఒదిగి వున్న మూడురోజుల వయసున్న శిశువును ముప్పైమూడు క్షణాల పాటు కసిగా గొంతు నులిమాడు.

అంతే...! తన ప్రాణం ఎందుకు ఎగిరిపోతోందో తెలుసుకునే అవకాశం కూడా ఆ శిశువుకు దొరకలేదు పాపం! నీలవేణి నిస్సహాయత ఆ బిడ్డను రక్షించలేకపోయింది.

"నా ఫ్రెండ్ ఆనందరావు తన భార్య ఒక్కసారి ఆడపిల్లను ప్రసవించినందుకే ఆమెకు విడాకులిచ్చేసాడు. కానీ నేను మాత్రం నీకు మూడు అవకాశాలు ఇచ్చాను. అయినా నీలో మార్పులేదు.

వీల్లేదు... నా చేత ముచ్చటగా మూడు పాపాలు చేయించావు. ఈ పాపాలకు పరిహారంగా నేను నీ మెళ్ళో మురిపెంగా వేసిన మూడు ముళ్ళు విప్పేయ్" గర్జించాడు.

నీలవేణి గుండెల మీద బండ పడ్డట్టయింది.

"ఇంకొక్క ఛాన్స్ ఇవ్వండి ప్లీజ్... ఖచ్చితంగా ఈ సారి మగబిడ్డనే కంటానండీ..." భర్త పాదాల వద్ద మోకరిల్లి వేడుకుంది నీలవేణి.

"అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నావే మగబిడ్డనే కంటానని..." ఆశ్చర్యంగా అడిగాడు చంద్రశేఖర్.

ఏదో ప్రస్తుతానికి తనను తాను రక్షించుకోవడానికి అలా అన్నది నీలవేణి. భర్త రివర్స్ గేర్ వేసేసరికి అయోమయంలో పడింది.

అంతలోనే... ఆమె మెదడుకు మెరుపులాంటి ఐడియా ఒకటి తట్టింది.

"వారసత్వమండీ..." కళ్ళు పెద్దవి చేస్తూ అన్నది.

"వారసత్వమా?... అదేమిటి..."

"అవునండీ మా అమ్మకు వరుసగా ముగ్గురు ఆడపిల్లలు. తర్వాత ఇద్దరు మగపిల్లలు. మా తమ్ముళ్ళు మీకూ తెలుసుకదండీ..."

"తెలుసు... తెలుసు... కానీ మీ అమ్మకు మీరు ఇద్దరే కదా ఆడపిల్లలు..."

చటుక్కున నాలుక కరుచుకుంది నీలవేణి. మళ్ళీ మెరుపులాంటి మరో ఐడియా ఆమె మెదడును ఢీ కొట్టింది.

"మా ఇద్దరి కంటే ముందు పుట్టిన మా

**అంబడిపూడి కొండలు**

అక్క చనిపోయిందండీ... ఇంకా మా అమ్మమ్మకు, వాళ్ళ అమ్మకు, వాళ్ళ అమ్మమ్మకు... అలా అందరికీ వరుసగా ముగ్గురు ఆడపిల్లలు, ఆ తర్వాతే మగ సంతానం.

ఇప్పుడు నాకూ ముగ్గురు ఆడపిల్లలు పుట్టి మీ దయవల్ల పోయారు గదా! ఈసారి ఖచ్చితంగా నాకు అబ్బాయి పుడతాడు."

"ఆల్‌రైట్... మీ వారసత్వం నీకు వస్తే ప్రయోజనం నీకే. లేకుంటే అప్పుడైనా నీకు సంసార వెలి తప్పదు." ఖచ్చితంగా చెప్పాడు చంద్రశేఖర్.

'థేంక్ గాడ్' అనుకుంది మనసులో.

★ ★ ★

పదిహేను నెలల పదిహేను రోజుల తర్వాత నీలవేణికి లక్కీగా అబ్బాయి పుట్టాడు.

చంద్రశేఖర్ ఆనందానికి ఆకాశమే అదిరింది. ఈ శుభవార్త తెలియ చేసి దేశ, విదేశాల్లో వుంటున్న తన మిత్రులతో ఆనందం షేర్ చేసుకుందామనుకున్నాడు.

అమెరికాలో వుంటున్న అవతారం -

"హలో... దిసీజ్ అవతారం స్పీకింగ్... "

"ఒరే అవతారం... ఐమ్ చంద్రశేఖర్... నాకు అబ్బాయి పుట్టాడురా."

"కంగ్రాట్స్‌రా చంద్రశేఖర్... నేనూ అబ్బాయి కోసమే ఎదురు చూస్తున్నాను. నేనొక్కడినే కాదురా... అమెరికన్ సిటిజన్స్ కూడా కడుపులో వున్న ఆడ శిశువులకు కడుపులోనే సమాధి కడుతున్నారు. అందరూ మగ సంతానం కోసమే ఉవ్విళ్ళూరుతున్నారు."

జపాన్‌లో వుంటున్న జంగారావు-

"హలో దిస్ ఈజ్ జంగం స్పీకింగ్... "

"ఒరే జంగం... నేను చంద్రశేఖర్‌నురా. నాకు అబ్బాయి పుట్టాడురా..."

"నీ జాతకం బాగుందిరా. యూ ఆర్ లక్కీ. నేను ఇప్పటికే నలుగురు ఆడశిశువులకు పరలోకానికి టికెట్స్ ఇచ్చాను. అయినా మా ఆవిడకు ఇంకా బుద్ధిరావడం లేదు. ఇంకొక్క ఛాన్స్ ఇస్తాను. అప్పటికీ ఆడపిల్లనే ప్రసవిస్తే డైవోర్స్ ఇచ్చేస్తాను. మరో పెళ్ళి చేసుకుని మహారాజు లాంటి మగబిడ్డకు జన్మనిస్తాను. జపాన్‌లో ఇప్పుడిప్పుడే మగపిల్లల ఉద్యమం ఊపందుకుంటోందిరా... "

లండన్‌లో వుంటున్న లంకేశ్వరం -

"హలో... లంక ఫ్రమ్ లండన్... "

ఒరేయ్... లంకా... నేను చంద్రశేఖర్‌నురా... నా ఎదురు చూపులు ఫలించాయిరా. నాకు అబ్బాయి పుట్టాడు"

"కంగ్రాట్స్‌రా... నాకూ మగపిల్లవాడే..."


"యూ... చీట్... నీకు అబ్బాయి పుట్టిన విషయం ఇంతలేట్‌గానా చెప్పేది...?"

"ఇంకా పుట్టలేదురా... స్కానింగ్‌లో తెలిసింది."

"అయితే నీకు ఎడ్వాన్స్ కంగ్రాట్స్‌రా..."

ఇంకా ఢిల్లీలో వుంటున్న కిళ్ళీరావుకు, ముంబైలో వుంటున్న ముత్యాలుకు, చెన్నైలోని చెన్నారావుకు ఫోన్ చేసి తన ఆనందాన్ని పంచుకున్నాడు చంద్రశేఖర్.

"చూశావా, ఏదో నేనొక్కడినే ఆడశిశువులను చంపుతున్నట్లు నన్నొక హంతకునిగా చూస్తావు. ఒక్కసారి కళ్ళు తెరిచి సమాజాన్ని




చూడు. ఇండియన్ సొసైటీ ఒక్కటే కాదు. ప్రపంచమంతా మగ సంతానమే కావాలను కుంటున్నారు.

ఆడపిల్ల పుట్టినప్పటి నుంచి అన్నీ బాధలే. ఆ పిల్ల జాతకం బాగుండక భర్త కానీ పోయాడంటే ఇక జీవితాంతం అది తల్లిదండ్రుల దగ్గర పడి ఏడ్వవలసిందే. మగపిల్లవాడి మీద ఖర్చు పెట్టే ప్రతీ రూపాయీ పెట్టుబడితో సమానం.. అది మళ్ళీ తిరిగి వస్తుంది. ఆడపిల్ల మీద పెట్టిన ఖర్చు తిరిగి వస్తుందా చెప్పు?

ఒక్కమాటలో చెప్పాలంటే ఆడపిల్ల పుట్టిన క్షణం నుంచీ కన్న తండ్రికి దిగులు, బాధ. ఎప్పుడూ విచారంతో వుండి, మనిషికి ఆయుః ప్రమాణం దిగజారడానికి ఆడపిల్లే కారణమన్న మాట. కోరి ఎవరూ కష్టాలు తెచ్చుకోరు గదా! అందుకే ముందు జాగ్రత్తగా... ఆడ శిశువుల పీడను మనం ముందే వదిలించుకున్నాం. ఏది ఏమైనా మీ వారసత్వానికి హేట్సాఫ్... !" గుక్క తిప్పుకోకుండా భార్యకు ఓ లెక్చర్ దంచాడు చంద్రశేఖర్.

★ ★ ★

"స్కూలుకి రోజూ నడిచి వెళ్ళలేకపోతున్నాను డాడీ, సైకిలు కొనివ్వరూ... ప్లీజ్" చంద్రశేఖర్‌ను చుట్టేస్తూ గారంగా అడిగాడు ఏడో తరగతి చదువుతున్న లోకేష్.

మన ఇంటి నుంచి మీ స్కూల్‌కి కొంచెం దూరమే కదరా! ఈ కాస్తదూరం కూడా నడవలేకపోతున్నావా?" విస్మయంగా చూసింది లోకేష్ వైపు నీలవేణి.

"నీకసలేం తెలీదు. వాడడిగింది జస్ట్... సైకిల్. మనం వాడిమీద ఎంత ఖర్చు పెట్టినా నష్టం ఏమీ వుండదు. వాడు మగపిల్లవాడు. సంపాదనాపరుడై తనకైన ఖర్చంతా ఫ్యూచర్‌లో ఖచ్చితంగా తిరిగి రాబట్టుకోగలడు.

నాన్నా... లోకేష్, నువ్వు మమ్మీ మాటలు పట్టించుకోవద్దు. నీకు సైకిల్ నేను కొనిస్తాగా..."

"థేంక్యూ డాడీ! డాడీ ఈజ్ బెస్ట్. మమ్మీ ఈజ్ వేస్ట్."

"చూశావా, వాడికన్నీ నా బుద్ధులే వచ్చాయి. ఏది మంచో, ఏది చెడో ఇప్పటి నుంచే తెలుసుకుంటున్నాడు." భార్య వైపు గర్వంగా చూసాడు.

ఆ తండ్రీ కొడుకులకు ఏమి చెప్పినా ప్రయోజనం లేదని తెలిసిన కృష్ణవేణి ఇక మాట్లాడలేదు.

★ ★ ★

ఎమ్‌సెట్‌లో మంచి ర్యాంక్ తెచ్చుకున్నాడు లోకేష్. చంద్రశేఖర్ ఉబ్బితబ్బిబ్బై పోయాడు.

"డాడీ.. ! ఇంజినీరింగ్‌కి మంచి ర్యాంక్ తెచ్చుకున్నాను కదా! గిఫ్ట్‌గా బైక్ కొనివ్వరూ... ప్లీజ్..."

నీలవేణి గుడ్లు తేలేసింది.

"జస్ట్... బైక్... ఓ..కే... యూ కెన్ పర్చేజ్ ఎ మోటార్ బైక్." గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు చంద్రశేఖర్.

ఇప్పుడు వాడికి బైకు ఎందుకండీ? వాడి ఇంజనీరింగ్ కోర్సు మొత్తం పూర్తయ్యేసరికి ఖర్చు బాగా అవుతుంది. బైక్ అంటూ మళ్ళీ ఈ అదనపు ఖర్చు ఎందుకు?" షాక్ నుంచి తేరుకున్న తర్వాత అంది నీలవేణి.

"నీకు ఎన్నిసార్లు చెప్పాలి... వాడి మీద ఖర్చు పెట్టే ప్రతీ రూపాయీ పెట్టుబడిలాంటిదే నని...!" గట్టిగా అరిచాడు చంద్రశేఖర్. ఆ అరుపుకు ఉలిక్కిపడింది నీలవేణి.

★ ★ ★

ఒక పెద్ద ప్రభుత్వరంగ సంస్థలో ఇంజనీర్‌గా ఉద్యోగం వచ్చింది లోకేష్‌కు.

తన జన్మ ధన్యమైనట్లుగా ఉవ్వెత్తున ఎగిశాడు చంద్రశేఖర్.

లోకేష్‌కు ఉద్యోగం వచ్చిన నాటి నుంచి ఆదాయం బాగా పెరగసాగింది.

"అబ్బాయికిక పెళ్ళి చేసేది లేదా?" లోకేష్‌కు పెళ్ళీడు వచ్చిన సంగతి గుర్తుచేసింది నీలవేణి.

"మంచి లక్షణమైన సంబంధం దొరకాలి కదా. వాడికి ఉద్యోగం వచ్చేంత వరకూ మనం వాడి మీద పెట్టిన ఖర్చు దాదాపు పది లక్షలు. కనీసం ఇరవై లక్షలైనా కట్నం అడగాలి. వుండు, నా ఫ్రెండ్స్‌కి ఫోన్ చేస్తాను."

అమెరికాలో వుంటున్న అవతారానికి ఫోన్ చేసాడు.


"హలో... అవతారం స్పీకింగ్"

"ఒరే అవతారం... నేను చంద్రశేఖర్‌నురా. అబ్బాయికి పెళ్ళి చేద్దామనుకుంటున్నాం. లక్షలు బాగా ఇచ్చే సంబంధం ఏదైనా వుంటే చూడరా."

"సారీరా! ఇక్కడ కట్నం బాగా ఇచ్చే సంబంధం కాదు గదా... అసలు ఆడపిల్లలే దొరకడం లేదు."

"ఏం... ఎందుకనీ...?" గాబరాగా అడిగాడు.

"గడిచిన మూడు దశాబ్దాల నుంచి ఇక్కడ ఆడశిశువులను చంపుతూ వస్తున్నందున స్త్రీల సంఖ్య బాగా తగ్గిపోయింది. ప్రతి వెయ్యి మంది పురుషులకూ మూడొందల మంది స్త్రీలు మాత్రమే వున్నారు. అమ్మాయిలకు కాంపిటీషన్ బాగా పెరిగిపోయింది. ఇక్కడ వధువులను కొనుక్కొంటున్నార్రా. పోటీకి వచ్చిన మగవాళ్ళ




లో ఎవరు ఎక్కువ డాలర్లు చెల్లిస్తే వాళ్ళకే పెళ్ళవుతోంది. లక్ష డాలర్లు చెల్లిస్తే గానీ మా అబ్బాయికి పెళ్ళి అయ్యేటట్లులేదు."

చంద్రశేఖర్ గుండెలు ధమధమా కొట్టుకున్నాయి. గాబరాగా జపాన్‌లో వుంటున్న జంగారావుకు ఫోన్ చేశాడు.

"ఐమ్ సారీ చంద్రశేఖర్... ఇక్కడ మా అబ్బాయికే పిల్లలు దొరకటం లేదు. జపాన్‌లో స్త్రీ, పురుష నిష్పత్తి వెయ్యికి రెండొందల ఇరవై. ఎక్కువ ధర చెల్లించిన మగవాడే ఇక్కడ వరుడవుతున్నాడు...

ఇంకొక విషయం... పాతిక సంవత్సరాల వయసు దాటిన అబ్బాయిలు ఇక్కడి అమ్మాయిలకు నచ్చటం లేదు. జపాన్‌లో బ్రహ్మచారుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అవునూ... ఇండియాలో ఎలా వుందిరా పరిస్థితి?"

"ఇక్కడ ఇంకా దారుణంగా వుందిరా. అసలే ఇక్కడ మూఢ నమ్మకాలు ఎక్కువ. ఇక్కడ ఆడపిల్లలను షోకేస్‌లో పెట్టి ప్రదర్శిస్తున్నారు. ఇక్కడ ఆడపిల్లలను మ్యూజియంలో వస్తువుల్లాగా చూస్తున్నారు.

విదేశాల్లో బాగా డబ్బు వెచ్చిస్తే అమ్మాయిని పెళ్ళి చేసుకునే అవకాశం వుంది. ఇక్కడ కేవలం చూడడానికే ఛాన్స్..." ఇప్పుడేది నాకు దారి?

★ ★ ★

"నాకు పెళ్ళి చేయండి డాడీ... ప్లీజ్..." ముప్పై ఏండ్ల కొడుకు మూడేండ్ల పిల్లాడిలా అరుస్తున్నాడు.

"ప్లీజ్... డాడీ... మా మంచి డాడీ... మమ్మీ ఈజ్ వేస్ట్... డాడీ ఈజ్ బెస్ట్... పెళ్ళి చేయండి డాడీ... "

లోకేష్ పిచ్చివాడిలా కళ్ళముందు అరుస్తూంటే కళ్ళు మాత్రం మూడు దశాబ్దాలకు ముందు చేసిన మూడు హత్యలను చూస్తున్నాయి. ●